"ఆశీర్వదించండి నాన్నా!"

రామారావుగారి చేతిలో మొదటి నెల జీతం పెట్టి ఆయన కాళ్ళకు నమస్కారించింది ఇందిర.

ఇందిర తల మీద చెయ్యి పెట్టి అస్పష్టంగా అన్నారు...."నీకు సుఖం లేదని తెలిసి కూడా నువ్వు సుఖపడాలని దీవిస్తున్నాను తల్లీ!"



జయశ్రీ ఉండవల్లి

# ఎదిరింపు?



"అదేమిటి నాన్నా! ఇప్పుడు నాకేమయిందని మీరిలా బాధపడ్తున్నారు? నేనీ రోజు పొందిన తృప్తి ఇంతకు ముందెప్పుడూ అనుభవంలోకి రాలేదు."

"మా తృప్తి కోసం నువ్వలా అంటున్నా అశాంతి తప్పదమ్మా!"

చెమ్మగిల్లిన కళ్ళను కుడిచేత్తో తుడుచు కుంటూ అన్నారు ఆయన.

"నేను ఆడపిల్లనని మర్చిపొమ్మని మీకెన్ని సార్లు చెప్పాను? అన్నయ్యే బ్రతికుంటే మీరిలా బాధపడేవారా?" గద్గదంగా అన్నది ఇందిర.

"కళ్ళెదుట కల్యాణం కావల్సిన పిల్ల కన్పి స్తుంటే గుండెల మీద కుంపటిని ఎవరు మర్చి పోగలరే?" జానకమ్మ అందుకున్నది.

"ఏమిటమ్మా నీ చాదస్తం? ముప్ఫయి ఏళ్ళొచ్చినా పెళ్ళి కాని వాళ్ళు ఎంతమందో వుంటే పాతికేళ్ళు రాకుండానే నన్నొక ఇంటికి పంపించెయ్యాలని చూస్తున్నావా?" కోపంగా తల్లిని చూస్తూ అన్నది ఇందిర.

"ఆడపిల్లవి.... ఎప్పటికైనా వెళ్ళిపోవాల్సిన దానివే! ఈ వేసవిలో ఏదో ఒక సంబంధం చూసి ముడి పెట్టేస్తే మా బాధ్యత తీరుతుంది." ఆవిడ కంఠంలో దిగులు తొంగి చూసింది.

"అమ్మా!" అరిచింది ఇందిర. "నాన్న గార్ని ఈ పరిస్థితుల్లో వదిలేసి నా దోవన నేను వెళ్ళిపోలేనమ్మా! నేనసలు పెళ్ళే చేసుకోను."

"అమ్మా! ఇందిరా తప్పు తల్లీ! ఈ అవిటి తండ్రి కోసం నీ నిండు జీవితాన్ని పాడుచేసుకో కమ్మా!" దగ్గు తెర రావటంతో ఆయన మాట ఆపేశారు.

తల్లిని, తండ్రిని పరీక్షగా చూసింది ఇందిర.

కాలం వేసిన కాటుకి శాపగ్రస్తుల్లా వున్నారు. చేతికి అంది వస్తాడనుకున్న కొడుకు అంద నంత దూరం వెళ్ళిపోతే కన్నవాళ్ళు ఎలా తట్టుకోగలరు? మహాలక్ష్మిలా కళకళలాడే అమ్మ ముఖం పాలిపోయి వున్నది. ఎప్పుడూ నవ్వుతూ వుండే అమ్మ నవ్వటమే మర్చిపోయినట్లున్నది.

ఎంత దర్జాగా వుండేవారు నాన్న! మిలటరీ మనిషిలా హుందాగా వుండేవారు. ఎన్ని విషయాలు చెప్పేవారు? ఎంత లోకజ్ఞానం నేర్పారు? గంభీర మైన ఆయన కంఠం వింటుంటే ఎంత ఉత్సా హంగా వుండేది!

పక్షవాతంతో పసిపిల్లాడిలా అయిపోయిన నాన్నను చూస్తుంటే ఆ అనుభవాలన్నీ పూర్వ జన్మ జ్ఞాపకాల్లా వున్నాయి. చప్పున కళ్ళు తుడుచుకున్నది ఇందిర. ఎప్పుడూ నవ్వుతూ వుండాలి....తను ఏ మాత్రం దిగులుగా వున్నా వాళ్ళ మనసులకి శాంతి వుండదు. తల్లి అన్నానికి పిలవటంతో ఆలోచన్లకు ఆనకట్టవేసి వెళ్ళింది.

ఆ రాత్రి అలవాటు ప్రకారం తండ్రికి పేపర్ చదివి విన్పిస్తున్నది ఇందిర.

ఆయన వార్తలేవీ వినకుండా పరధ్యానంగా వుండటం గమనించి....

"ఏం నాన్నా అలా వున్నారేం? ఒంట్లో ఎలా వున్నది?" ఆదుర్దాగా అన్నది.

"ఏమీ లేదమ్మా! నిన్నొక ఇంటి దాన్ని చేస్తే మా బెంగ తీరుతుందమ్మా! మీ మావయ్య ఏదో సంబంధం గురించి వ్రాశాడు. నీకు నచ్చితే...."

"నాన్నా!" అసహనంగా అరిచింది.

"ఎందుకే ఆ కోపం! పెళ్ళి చేసుకోకుండా ఎల్లకాలం ఇలాగే వుంటావా?" జానకమ్మ పక్కవేస్తూ అన్నది.

"అమ్మా! మీకు కొడుకునయినా, కూతురైనా నేనే! మిమ్మల్నిలా వదిలేసి నేను ఎక్కడికీ వెళ్ళలేను. ఇంకెప్పుడూ పెళ్ళిమాట ఎత్తకు."

"స్త్రీ ఎవరో ఒకరి అండదండలతో వుండటం అవసరం తల్లీ! మేము రాలిపొయ్యామంటే తోడూనీడా ఎవరూ లేకుండా ఎలా బ్రతకగలవు? మా కోసమయినా నువ్వు ఒప్పుకోవాలి!" పక్కకు ఒత్తిగిల్లుతూ అన్నారు. ఆయనని సరిగ్గా పడుకో బెట్టి రగ్గు కప్పింది ఇందిర. తండ్రిని అలా చూస్తుంటే గుండెల్నెవరో పిండినంత బాధగా వుంటుంది. జీవచ్ఛవంలా అయిన నాన్ననూ,



అమాయకురాలైన అమ్మనూ వదిలి ఎక్కడికి వెళ్ళను? ఎలా వెళ్ళను? అనుకున్నది ఇందిర.

"అయినా చూసేవాళ్ళు ఏమనుకుంటారు? నీ జీతం డబ్బుల కాశపడి పెళ్ళిమాట తలపెట్ట లేదనుకోరూ?" ఆవిడకు ఈ బూజుపట్టిన సంఘం గురించి బాగా తెలుసు.

"నా కాళ్ళమీద నేను నిలబడగలనన్న నమ్మకం నాకున్నది. పనిలేని వాళ్ళందరి మాటలు పట్టించుకోకుండా నా బ్రతుకేదో బ్రతకగలననే ధైర్యం నాకున్నది. నా గురించి మీరేం దిగులు పడకండి."

ఆ మాటలతో వాళ్ళ దిగులు మరీ ఎక్కువయింది. కాని కొంచెం తృప్తిగా వుండటానికి చివరగా ఒక మాట అన్నది ఇందిర:

"నాతోపాటు మీ బాధ్యతను కూడా స్వీకరించే వ్యక్తి వస్తే చేసుకోవటానికి నాకేం అభ్యంతరం లేదు." మరి మాట్లాడటం ఇష్టం లేనట్లు దుప్పటి కప్పేసుకున్నది. 'అభ్యంతరం లేదు' అన్నమాట ఆనందం కల్గించినా ఇందిర అన్నదేమిటో పూర్తిగా అర్థమయ్యేసరికి ఆందోళన కలిగింది ఆ ముసలి వాళ్ళకు.

ఈ కాలంలో అలా ముందుకు వచ్చేవాళ్ళు ఎవరూ వుండరని వాళ్ళకు అనుభవం నేర్పిన పాఠం. అందుకే ఇందిర వివాహ విషయంలో ఆశ వదిలేసుకున్నారు.

రోజులు బంతుల్లా దొర్లుకుపోతున్నాయి. దిన చర్య యాంత్రికంగా జరిగిపోతున్నది. కాలం కొంత మందిని దారుణంగా హింసిస్తుంది. సరిగ్గా ఇందిర విషయంలో అలాగే జరిగింది. రామారావుగారి రెండోచెయ్యి కూడా పడిపోయింది. జానకమ్మగారి ముఖంలో ముసలితనం ముద్రవేసింది. ఆవిడ తోడు లేనిదే ఆయనకు క్షణం జరగటం లేదు. అమ్మకిప్పుడు ఇద్దరు పిల్లలు అనుకుంటూ వుంటుంది ఇందిర.

మార్పులేని జీవితంలో మెరుపులా ఒక అవకాశం వచ్చింది ఇందిరకు.

"నా పేరు మాధవరావు. నన్ను గోపాలరావు గారు పంపించారు" అంటూ తనని తాను పరిచయం చేసుకుంటూ ఇందిర చేతికి ఉత్తరం అందించాడు ఒక యువకుడు.

మేనమామ వ్రాసింది చదువుతుంటే కనుబొమలు ముడిపడ్డాయి. విసుగుని ఏమాత్రం పైకి కనబర్చకుండా...."రండి! మా నాన్నగారిని పరిచయం చేస్తాను!" తండ్రి దగ్గరకు తీసుకెళ్లింది ఇందిర అతన్ని.

"చూశారుగా మా పరిస్థితి. ఈ స్థితిలో వాళ్ళను వదిలి నేనెక్కడికి వెళ్ళ దల్చుకోలేదు. నా జీతంతోనే యిల్లు గడవాలి. ఇల్లు మటుకు సొంతమే. అద్దె బాధలేదు. బాగా ఆలోచించుకొని మీ నిర్ణయాన్ని చెప్పండి. చాలా రోజుల క్రిందటే ఆడపిల్లనన్న సంగతి మర్చిపోయాను నేను. ఇప్పుడు మీరొచ్చి గుర్తు చేశారు. వివాహ విషయంలో మీ అభిప్రాయం ఏదైనా నాకు బాధ లేదు. మీరు ఏ సంగతీ చెప్పటానికి ఎంత టైము తీసుకున్నా ఫరవాలేదు" సూటిగా అతని వంక చూస్తూ మనసులో మాట చెప్పేసింది ఇందిర.

"నేను మిమ్మల్ని పెళ్ళి చేసుకుంటాను." వెంటనే చెప్పాలన్నంత ఆవేశం వచ్చింది మాధవరావుకు. కాని, అహం గుర్తుకొచ్చి, అంతరాత్మ హెచ్చరించటంతో "రెండ్రోజుల్లో చెప్తాను" అంటూ లేచాడు. కాఫీ ఇచ్చి పంపించింది ఇందిర.

మర్నాడు ప్రొద్దున్నే వచ్చి తన నిర్ణయం చెప్పాడు మాధవరావు.

"ట్రాన్స్‌ఫర్ కోసం ప్రయత్నించి త్వరలో మీ ఊరు....సారీ....మీ ఇంటికి వచ్చేస్తాను."

చిరునవ్వుతో అతను చెబుతుంటే తెల్లబోయింది ఇందిర.

ఈ వార్తవిన్న వృద్ధ దంపతులకు ఆనంద బాష్పాలు రాలాయి.

'అదృష్టం .... ఇందిరది కాదు .... మనది' అనుకున్నారు.

ఇందిర జీవితంలో కొత్త అధ్యాయం అందంగా మొదలై ఆనందంగా ఏడాది గడిచింది.

కూతురి జీవితానికో గమ్యం ఏర్పడినందుకు నిశ్చింతగా వున్నారు రామారావుగారు. సంతోషంతో సగం బలం పుంజుకున్నారు.

జానకమ్మగారికి మనస్తిమితం చిక్కింది.

తల్లీ, తండ్రీ ఆ మాత్రం శాంతిగా వున్నందుకు ఇందిర ఎంతో ఆనందించింది. మాధవరావు దేవుడిలా కన్పించాడు.

పేపరులో వార్తలు వింటూనే నిద్రలోకొరిగారు రామారావుగారు. ఆయనకు రగ్గు కప్పి తల్లికి కాళ్ళు పడ్తూ కూర్చుంది ఇందిర.

జానకమ్మ జ్వరపడటం ఇందిరకు ఊహ తెలిశాక జరగలేదు.

"ఇక చాలు వెళ్ళమ్మా! అతనొక్కడూ వున్నాడు" కాళ్ళు ముడుస్తూ అన్నది తల్లి.

"కాస్సేపాగి వెళ్తాన్లే!" తల్లిమాట తేలికగా కొట్టేసింది.

ఇందిర మనసెందుకో స్తిమితం తప్పింది. రెండు మూడు రోజుల్నించి మాధవరావు ప్రవర్తన వింతగా వున్నది.

అంతకు ముందు—

ప్రతిరోజూ అతను ఆఫీసునుంచి రాగానే మామగార్ని పలకరించి, వంటింట్లో వున్న అత్తగారి దగ్గరకు వెళ్ళి, తెచ్చిన కూరల సంచీ యిచ్చి, తన కిష్టమైన కూరలేవో చెప్పి చేయించుకొనేవాడు.

'మనలో కలిసిపోయే పిల్లాడు వచ్చాడు!' అని వాళ్ళు మురిసినంతసేపు పట్టలేదు. ఈ మధ్య ధుమధుమలాడుతూ ఇంటికి వస్తున్నాడు—వచ్చీ రావటంతోనే గదిలోకి దూరి భోజనానికైనా ఇవతలికి రాకుండా, గదిలోకే తెప్పించుకుంటున్నాడు.

అల్లుడు పలకరించటం లేదని రామారావుగారి మనసు కొట్టుకుంటున్నది.

అతనికేం లోటు చేశామని మాట్లాడటం మానేశాడు? జానకమ్మ గతంలో తన ప్రవర్తనని తరిచి చూసుకున్నది.

ఆయన సరదాగా నాన్నగారితో రెండు మాటలు మాట్లాడి, అమ్మచేత్తో అన్నం పెట్టించుకుంటే బాగుంటుందని పదే పదే అనుకున్నది ఇందిర.

"ఇందిరా!" కోపంగా విన్పించిన మాధవరావు గొంతుకు ఉలిక్కిపడింది.

"ఇందాకే వెళ్ళవే అంటే విన్నావుకాదు; త్వరగా వెళ్ళు" కూతురికి మనవడ్ని అందించింది.

"ఇంకా ఆ ముసలివాళ్ళ సేవ కాలేదా?" తీక్షణంగా చూస్తూ అన్నాడు.

"ఇక్కడ ఒక మొగుడున్నాడని గుర్తుందా? అసలు నీకు పెళ్ళయిందనీ, బిడ్డతల్లివయ్యావనీ మరిచిపోయావా? ఇంకా బాలా కుమారిననే అనుకుంటున్నావా?" వెటకారంగా అంటుంటే.... 'ఈ రోజు ఏమయింది ఇలా ప్రవరిస్తున్నా.'రని ఆశ్చర్యంగా చూస్తున్నది ఇందిర.

"పక్క దులిపివెయ్యాలన్న జ్ఞానం లేకుండా, ఆ ముసలివాళ్ళ పక్కలో కూర్చుంటావా? నీకసలు భర్త అంటే గౌరవం వుంటే కదా! చచ్చీ చెడీ ఆఫీసునుంచి వస్తే కాఫీ త్రాగానో లేదో కూడా కనుక్కోవల్సిన అవసరం లేదనుకుంటున్నావా? మీ అందరికీ నేను గతిలేనివాడిలా కనిపిస్తున్నానా?" ఆయాసం తీర్చుకోవటానికి క్షణంసేపు ఆగాడు మాధవరావు.

"మీరెందుకింత ఆవేశపడుతున్నారో అర్థం కావటం లేదు. నా వల్ల ఏదైనా పొరబాటు జరిగితే చెప్పండి....దిద్దుకుంటాను. అంతేగాని–మీరిలా అనవసరంగా అరిస్తే బాగుండదు."

"నేను అరిచిందే కనిపిస్తున్నది కాని.... నీ తప్పు నీకు తెలియటం లేదు....మా అమ్మ మా నాన్నా అంటూ వాళ్ళ వెనకాల తిరగటమే కాని.... మొగుడికి ఏం కావాలో కనుక్కుందామన్న ఆలోచనైనా వున్నదా? అసలు నిన్ననటం ఎందుకు? ఆ ముసలి పీనుగుల్ని అనాలి."

"ఏవండీ?" కోపంతో గట్టిగా అరిచింది. "మీకిష్టం లేకపోతే మాట్లాడకండి. అనవసరంగా వాళ్ళనంటేమటుకు వూర్కోను. ఆ పరిస్థితుల్లోనే మీ తల్లి తండ్రులుంటే ఏం చేసేవారు?"

"నాకు కన్నవాళ్ళు వుంటే మీ ఇంటికెందుకు వచ్చేవాణ్ణి? ఒంటరిగాణ్ణి కాబట్టే వచ్చాను. అనవసరంగా నీతో గొడవ నాకెందుకు గాని.... నేనొక పని చెబుతాను చేస్తావా? ఆ పని చేశావంటే నిన్నూ, నీ వాళ్లను ఏమీ అనను." సిగరెట్ అంటిస్తూ అన్నాడు మాధవరావు.

అతని మనసులోని కోరికేమిటో పసిగట్టాలన్నట్లు పరీక్షగా చూసింది ఇందిర.

"ఏం మాట్లాడవేం?" ఆరిపోయిన అగ్గిపుల్లను నేలకు విసిరికొడ్తూ అన్నాడు.

"ముందు మీ మాట ఏమిటో చెప్పండి!" నిదానంగా అన్నది ఇందిర.

"వెరీ సింపుల్! ఈ ఇల్లు నా పేర వ్రాయించు." ఇందిర పక్కకు వచ్చి భుజం మీద చేయివేశాడు.

"ఏమిటీ మీరనేది?" ఆందోళనగా అన్నది అతని చేతిని తొలగిస్తూ.

"తెలుగులోనే మాట్లాడుతున్నాను. అర్థం కావటం లేదా? ఈ ఇల్లు నా పేర వ్రాయించు." ఒక్కొక్క అక్షరమే ఒత్తి పలుకుతూ అన్నాడు.

"ఇంపాసిబుల్!" గట్టిగా అరిచింది ఇందిర.

"ఏం ఎందుకు? పైసా కట్నం లేకుండా చేసుకున్నందుకు చవటలా కనిపిస్తున్నానా? నా సంగతి నీకు పూర్తిగా తెలియదు ఇందిరా! నేను ఏదైనా అనుకున్నానంటే అది సాధించి తీరుతాను." ఆవేశంగా అన్నాడు మాధవరావు.

"ఏవండీ మీరిలా మాట్లాడటం న్యాయంగా వుందా? ఒకపక్క అనారోగ్యంతో వాళ్లు బాధ పడుతుంటే ఆస్తి అడిగి వాళ్లను అశాంతిపాలు చేస్తారా? మనిషిగా ఒక్క క్షణం ఆలోచించండి. దేనికైనా సమయాసమయాలు వుంటాయి కదా?" అనునయంగా అన్నది.

"సారీ ఇందిరా! అవన్నీ నేను ఆలోచించను. నా ఫ్రెండ్స్ ముందు నేను తలెత్తుకు తిరగలేకపోతున్నాను. మావగారింట్లో వుంటున్నాడు.... పెళ్ళాం తెస్తే తింటున్నాడు అని అందరూ నా గురించి అనుకుంటుంటే విని భరించే శక్తి నాకు లేదు. అయినా ఈ ఇల్లు నా పేరుతో వుంటే వచ్చే నష్టమేమిటి?" కోపంతో వూగిపోతూ అన్నాడు.

"మీరూ ఉద్యోగస్థులే కదండీ! మీరేమో ఇల్లరికం వుండటం లేదే? ఎవరో ఏదో అన్నారని ఇంత ఆవేశపడతారా? కొంచెం శాంతంగా ఆలోచించండి." సర్ది చెప్పబోయింది.

"ఈ కబుర్లకేం గాని....మీ నాన్నతో చెప్పి రేపే ఈ ఇల్లు నా పేర మార్పించు."

"మార్పించను...ఈ ఇల్లు నాన్నగారి స్వార్జితం. ఆయనకిష్టమైన వాళ్ళకు రాసిస్తారు.... మీ సంగతేమో తెలియదుగాని....నాకింకా సిగ్గూ, అభిమానం మిగిలున్నాయి." కోపంగా అన్నది ఇందిర.

"ఏమన్నావు?" చెంప ఛెళ్ళుమనిపించాడు మాధవరావు.

"నేను సిగ్గుని వదిలేసి మీ ఇంటికి వచ్చాననుకున్నావా? మగవాణ్ణి.....మొగుణ్ణి.....ఎంత మాట పడితే అంత మాట అంటావా?"

చేత్తో చెంపను పట్టుకొని నిశ్చేష్టురాలిలా నిలబడింది.

"నాయనా!" తలుపు తోసుకు వచ్చింది జానకమ్మ.

"బాబూ! ఆడపిల్లని అపురూపంగా పెంచుకున్నాము ఇన్నాళ్ళూ. ఈ రోజు మా ముందే అమ్మాయి మీద చెయ్యి చేసుకుంటావా? నీక్కావాల్సింది ఇల్లేగదా! తీసుకో! నువ్వు వుంచుకో. నీ పేరే రాయించుకో! ఈ చిన్న విషయానికి ఇంత పెద్ద గొడవ చేస్తావా?" ఆవిడ కంఠం వణికింది.

"ఒక్కమాట మీ మావగారితో చెప్తే రేపీ పాటికి ఇది నీ ఇల్లే అయ్యేదికదా? బిడ్డతల్లి మీద ముందూ వెనకా ఆలోచించకుండా అలాగేనా ప్రవర్తించటం?" బాధగా కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ అన్నదామె.

"అయితే ఇంకేం? వ్రాయించండి....మీరు ఒప్పుకుంటారని తెలిస్తే ముందు మిమ్మల్నే అడిగే వాణ్ణి. ఇంత గొడవ జరగకే పోను. మావగారు లేచాక ఆయనతో చెప్పండి." మంచం మీద కూలబడుతూ అన్నాడు మాధవరావు.

గట్టిగా విన్పించిన మాటలతో నిద్రాభంగమై లేచి కూర్చున్నారు రామారావుగారు.

"ఏమిటమ్మా ఇందూ! ఏం జరిగింది తల్లీ?" ఆదుర్దాగా అడిగారు.

"ఏమీ లేదండీ! ఈ ఇల్లు తన పేర వ్రాయించమంటాడు అల్లుడు. ఈ పిచ్చి మొద్దేమో అందుకు ఒప్పుకోలేదు. దాంతో అతనికి కోపమొచ్చింది."

"ఇలాంటి విషయాలకు ఆవేశం తెచ్చుకుంటే ప్రయోజనమేముంది తల్లీ! అలాగే అల్లుడి పేరే రాద్దాము." అంగీకారంగా తలూపుతూ అన్నారు.

"నాన్నా! ఉన్న ఈ ఒక్క ఆధారాన్ని వదిలేసుకుంటే ఎలా బ్రతుకుతారు? చెప్పుడు మాటల వల్ల ఆస్తి స్వాధీనం చెయ్యమన్నారు....మళ్ళీ అలాంటి మాటలే విని....నిన్నూ, అమ్మను ఇంట్లోంచి వెళ్ళగొడితే ఈ జన్మకు నన్ను నేను

క్షమించుకోగలనా? దేవుడు నన్ను క్షమిస్తాడా? ఈ పనికి మటుకు నేనొప్పుకోను.'' స్థిరంగా అన్నది ఇందిర.

'' మా బాధ్యత పెళ్ళికానంతవరకే నీకు తల్లీ! నువ్వో ఇంటి దానివయ్యాక, నీ ఇంటి గురించే ఆలోచించాలమ్మా!'' కూతుర్ని బుజ్జగిస్తున్నట్లుగా అన్నాడు తండ్రి.

'' నిజమే నాన్నా! జన్మనిచ్చింది మీరు. జీవితాన్ని యిచ్చింది ఆయన. నాకిద్దరూ కావాలి. ఇద్దరి సుఖ సంతోషాలూ కావాలి. మిమ్మల్ని ఆదరించేందుకు మీకూ ఒక కొడుకు వుంటే....అందరి ఆడపిల్లల్లాగే నేనూ చుట్టపు చూపుగా వచ్చేదాన్ని; పది రోజులుండి వెళ్ళేదాన్ని. కాని....మీ ఆస్తి మీద ఇప్పుడు మీకెంత హక్కుందో, మీ గురించి మాట్లాడ్డానికి నాకూ అంత బాధ్యత వున్నది. దయచేసి ఈ విషయంలో మీరు జోక్యం కలగచేసుకోవద్దు.''

వాళ్ళు మాట్లాడేటందుకు అవకాశం ఇవ్వకుండా గదిలోకి వెళ్ళిపోయింది ఇందిర.

మాధవరావు చిన్న చిన్న వెండి వస్తువులన్నీ కావాలంటూ తీసుకెళ్ళిపోతున్నాడు. జీతం కూడా సరిగ్గా ఇంటికి తీసుకురావటం లేదు. ఇందిరకు తెలిసిన ఇద్దరు ముగ్గురు స్నేహితులు అతనీ మధ్య ఆఫీసుకు రావటం మానేశాడనీ, నిద్రాహారాలుమాని పేకాటలో కూర్చుంటున్నాడనీ తెలియచేశారు. మొదట్లో ఇందిర నమ్మలేదు....జరిగిపోతున్న కాలం నమ్మకాన్ని కల్గించి జారిపోయింది. అతను మారిపొయ్యాడు...పూర్తిగా మారిపోయాడు. ఇందిర కళ్ళల్లో నీళ్ళు నిలిచాయి. పసివాడిని జోకొడుతూ పడుకున్నది.

తెలతెల వారకుండానే మాధవరావు, మామగారి దగ్గరకువెళ్లి ఇంటి ప్లీడరు ఎవరో, ఎక్కడుంటాడో కనుక్కున్నాడు. ఇంటికి ఎన్నివేలు ఖర్చయిందో, స్థలమెన్ని గజాలున్నదో అడిగాడు. అతడడిగిన ప్రశ్నలకు ఓపికగా జవాబులిచ్చారు రామారావుగారు.

దెబ్బ తిన్న నివంగిలా వచ్చింది వాళ్ళ మధ్యకు ఇందిర.

'' వీల్లేదు....అమ్మ పేరు మీదవున్న ఈ ఇల్లు మీ పరం కావటానికి నేనొప్పుకోను. వాళ్ళకున్న ఒకే ఒక ఆధారాన్ని లాగేసుకుంటారా? యాభై వేలు చేసే ఇల్లున్నప్పుడే వాళ్ళతో మాట్లాడని మీరు, పైసాకు విలువలేకుండా అంతా మీకిచ్చి చేతులు దులుపుకుంటే.... వాళ్ళ మొహమైనా చూస్తారా మీరు? కావాలంటే నా జీతమంతా పైసలతో సహా తీసుకోండి. ఈ ఇల్లు మటుకు వీళ్ళ జీవితాంతం అడగకండి.'' తెచ్చిపెట్టుకున్న గాంభీర్యం సడలిపోయి, అబలగా దుఃఖిస్తూ అన్నది ఇందిర.

ఏడుస్తూ చూసింది తల్లి.

అనంతమైన వ్యథని మనసులో దాచుకొని బాధగా చూశాడు తండ్రి.

చిరాకుగా, విసుగ్గా చూశాడు మాధవరావు.

'' ఇందిరా! ఆఖరుసారిగా అడుగుతున్నాను. ఈ ఇంటిని నాకు రాయిస్తావా? నా జీవితంలోంచి వెళ్ళిపోతావా?'' మాటల్లో కఠినత్వాన్ని, ముఖంలో కర్కశత్వాన్ని చూపించాడు. ఉలిక్కిపడ్డారు ముగ్గురూ.

'' ఇల్లు మీ స్వాధీనం కాకుండానే ఇలా మాట్లాడుతున్నారు మీరు. ఆస్తి మీపరం అయిన మరుక్షణంలోనే మమ్మల్ని ఇంట్లో ఒక్కక్షణం వుండనిస్తారనుకోవటం దురాశే! మీ జీవితంలోంచి నేను వెళ్ళపోలేను....వెళ్ళిపోను....నా జీవితంలోంచి మీరే తప్పుకుంటున్నారు. కాని, మీ ప్రతిరూపం నా దగ్గరే వున్నది. ఒక్క నిముషం మీ మనసుని అదుపులో పెట్టుకుని ఆలోచించండి. మీ కర్తవ్యమేమిటో బోధపడుతుంది. రేపోమాపో రాలిపోయే పండుటాకుల గురించి పచ్చని చెట్టుని పడగొట్టుకుంటారా? ఏమాత్రం మానవత్వం వున్నా, బాధ్యత వున్న భర్తగా మీరలాంటి పెద్ద మాట అనరు. కట్టుకున్న భార్య అంటే కదలాడే బొమ్మనుకున్నారా? తేలికగా, మాటలతో ఈ బంధం తెగిపోతుందనుకున్నారా? చదువుకున్నా, మూర్ఖుడిలా ప్రవర్తించకండి'' ఆవేశంగా అన్నది ఇందిర.

'' నేనీ ఇంట్లో ఒక్కక్షణం కూడా వుండను. పెళ్ళికి ఈ ఇల్లు నాపేర రాయిస్తానన్నాడు మీ మేనమామ. ఫలితంగా నీ మెళ్ళో తాళి కట్టాను. తల్లిని చేశాను. నా అండ లేకపోతే నువ్వెలా బ్రతగ్గలవో ఆలోచించుకో! నేను వెళ్ళిపోతే ఈ సంఘం నిన్నెలా దెబ్బ తీస్తుందో ఊహించుకో! కావాలంటే రెండ్రోజులు టైమిస్తాను'' సిగరెట్ ముట్టిస్తూ అన్నాడు.

'' అక్కర్లేదు. మీరు రెండు సెకండ్లు కూడా టైమివ్వద్దు. ఆస్తి కోసం చేసుకున్నారని విన్నప్పుడే మీ మీద గౌరవం పోయింది. భార్యకు విలువివ్వని మీతో కాపురం చెయ్యటానికి నా అణువణువూ ఎదురు తిరుగుతున్నది'' దుఃఖాన్ని నొక్కిపెడుతూ అన్నది ఇందిర.

'' ఇందూ! ఆడపిల్లవి....అలాంటి మాటలు మాట్లాడగూడదు. బాబూ! అది చిన్నపిల్ల. దాని మాటలు పట్టించుకోకు. ఈ ఇల్లు నువ్వే తీసుకో!'' ఏడుస్తూ అన్నారు అత్తమామలు.

'' అవసరం లేదండీ! ఆడదానికే అంత అహంకారముంటే....మగవాణ్ణి.....చవటలా ఇక్కడే పడుండమంటారా?'' చరచరా లోపలికి పోయి తన బట్టలన్నీ పెట్టెలో కుక్కుకున్నాడు.

'' ఏవండీ!'' కొడుకుని తీసుకొని అతని దగ్గరకు వెళ్ళింది ఇందిర.

'' ఈ వయసులో వాళ్ళకు దుఃఖాన్ని కల్గించకండి. ఈ పసివాడి ముఖం చూసైనా మీరు మనసు మార్చుకోండి.'' ప్రాధేయపడింది.

'' హుఁ'' నిర్లక్ష్యంగా నవ్వాడు మాధవరావు.

'' నేను వెళ్ళిపోతున్నాను. నాకిష్టం లేని చోట అరక్షణం కూడా వుండను. నన్నెవరూ ఆపలేరు. వీణ్ణి ఎలా పెంచాలా అని దిగులు పడ్తున్నావా?'' చేతిలోకి పెట్టె తీసుకుంటూ వెటకారంగా అన్నాడు.

'' పొరబడ్డారు. ఈ పసికందుని ఉత్తమ భావి పౌరుడిగా తీర్చిదిద్దటానికి నా శరీరంలోని ప్రతి రక్తపు బిందువుని వెచ్చిస్తాను. వీణ్ణి ఆదర్శ యువకుడిగా మలచటానికి నా జీవితాన్నే పణంగా పెడ్తాను. మీరు ఎలాంటి వారైనా నా జన్మకొక సార్థకతను కలిగించారు. నన్ను తల్లిని చేశారు. 'అమ్మా' అని పిలిపించుకొనే అదృష్టాన్ని ప్రసాదించారు. అందుకు మీకు ఈ జన్మంతా కృతజ్ఞురాలిగా వుంటాను.''

మాధవరావు ఇందిర మాటలు వింటూనే నెమ్మదిగా అడుగు బయట పెట్టాడు.

'' అమ్మా! ఇందిరా! అతను వెళ్ళిపోతున్నాడు....ఆపమ్మా!''

తల్లితండ్రుల మాట విని తలెత్తి చూసింది ఇందిర.

నీళ్ళు నిండిన కళ్ళకు అస్పష్టంగా కన్పించాడు అతను.

''వెళ్ళనీయండి నాన్నా! నేనంతటి అబలనేం కాను. నా బతుకు నేను బతగ్గలను. ఇందులో నా తప్పేమీ లేదు. ఏదో ఒక రోజు ఆయనే తప్పక తిరిగొస్తారు. అంతవరకూ ఆయన ప్రతిరూపాన్ని జాగ్రత్తగా పెంచి పెద్ద చేస్తాను. ఈ జన్మకీ వరం చాలు'' కొడుకుని హృదయానికి గాఢంగా హత్తుకుంటూ అన్నది ఇందిర. *